క్లుప్తంగా

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

అమరావతి: ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమంలో బుధవారం మండల పరిధిలోని అమరావతి, ఎనికపాడు గ్రామాలలో 1.5 కోట్ల రూపాయలతో తారురోడ్డు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు తొలుత మండలంలోని ఎనికపాడులో అమరావతి-గుంటూరు రోడ్డు నుంచి ఎనికపాడు ఎస్సీ కాలనీవరకు నిర్మించనున్న తారు రోడ్డుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం అమరావతి గోపాల్‌నగర్‌లో రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, ఎంపీడీఓ మాధవి పాల్గొన్నారు.

ఈ నెల 18న జాబ్ మేళా

సత్తెనపల్లి(ముప్పాళ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా శాఖ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వావిలాలపార్క్ పక్కన ఉన్న గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకొని, 18–40 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు వారి బయోడేటా, అర్హతా పత్రాలు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఔత్సాహికులు ముందుగానే http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. జాబ్‌డ్రైవ్ జరిగే సమయంలో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థి



క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థి మన్నెం జ్ఞానేశ్వర్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత బుధవారం తెలిపారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారన్నారు. ఆ పోటీలలో సెయింట్ ఆన్స్ విద్యార్థి జ్ఞానేశ్వర్ అండర్– 11 విభాగంలో 500 మీటర్ల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 18,19,20 తేదీల్లో కాకినాడలో అంతర్జిల్లాల స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు వివరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అమరావతి: అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం కోసం సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సమాచార హక్కు చట్టం అమలు చేస్తున్నారని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధరణికోట రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టం ద్వారా సమాచారాన్ని రాతపూర్వకంగా, ఆన్‌లైన్ సంబంధిత యంత్రాంగానికి నిర్ణీత రుసుంతో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

క్రోసూరు: ఎక్సైజ్‌శాఖ క్రోసూరుసర్కిల్ పరిధిలోని పది మద్యం షాపులు ప్రారంభానికి సిద్ధం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ టి.తులసి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ స్టాక్ రావటంతో ఆలస్యం కావటంతో షాపులన్నీ గురువారం ప్రారంభిస్తారని తెలిపారు. లైసెన్సు దారులందరూ ఇప్పటికే షాపుల ఏర్పాటుకు దుకాణాలు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. క్రోసూరు,అచ్చంపేట, బెల్లంకొండ మూడు మండలాల్లోని షాపులన్నీ నిబంధనల ప్రకారం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కాపు సంఘం నాయకుడు సుబ్బారావు మృతి



సత్తెనపల్లి(ముప్పాళ్ల): సత్తెనపల్లి పూర్వ తాలుకా కాపు సంఘం ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మార్తాల సుబ్బారావు(74) బుధవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది పక్కాల సూరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కంభాల వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, మట్టాబాబు సందర్శించి నివాళులర్పించారు.

తెల్లబంగారానికి తెగుళ్లు

- పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు
- ఆందోళనలో రైతులు



తాళ్లచెరువులో వేసిన పత్తి పంట

అచ్చంపేట: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆరుగాలం కష్టించి పంటలు వేస్తే కాపునకు వచ్చే పరిస్థితులలో ప్రకృతి వైపరిత్యలతో రైతన్నలు తల్లడిల్లిపోయారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేల పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నిర్దేశించిన ఆంక్షలవల్ల చాలా మంది రైతులకు పరిహారం అందలేదు. ఇవేవి చాలవన్నట్లు పత్తిపంటపై తెగుళ్ల దాడి ఎక్కువైంది. తెల్లదోమ, పచ్చదోమ, గులాబిరంగు పురుగులు, రసం పీల్చే పురుగులు పత్తి పంటపై విపరీతమైన ప్రభావం చూపుతున్నాయి. వీటిని తట్టుకోవాలంటే భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. పెట్టుబడులు పెట్టినా ఆశించిన దిగుబడి వస్తుందా అంటే అదీలేదు. సరే అరకొరగా పండిన పంటకైనా గిట్టుబాటు ధర ఉందా అంటే ఆ ఊసేలేదు.

ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి

పత్తి పంట వేయాలంటే ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. విత్తనాలు కొనుగోళ్లు, ఎరువు వేసేందుకు, అరకలు దునేందుకు, విత్తనాలు విత్తేందుకు, కలుపులు తీసేందుకు, ఇలా ఖర్చుల రూపంలో భారీగా పెట్టుబడులు పెరిగాయి. వేసిన పిందె, గూడ నిలబడాలంటే రోజుమార్చి రోజు పురుగు మందులు పిచికారీ చేయాల్సిందే. ఎంత చేసినా పంట చేతికి అందే వరకు రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. అదే కౌలు రైతులకు అయితే మరో రూ.20 వేలు కౌలు అవుతుంది.

దిగుబడి కష్టం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భూమిలో నీళ్లు నలబడటం వలన తేమశాతం అధికమై పంట ఉరకేసి పోవడంతో ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటా రూ.6,000 ఉంది. మూడు క్వింటాళ్లు వేసుకున్నా వచ్చేది రూ.18 వేలు. అయిన పెట్టుబడి రూ.30 వేలు, అదే కౌలు రైతుకైతే మరో రూ.20 వేలు అదనం.

ఐదు వేల హెక్టార్లలో పంట

ఈ ఏడాది మండలంలో సుమారు ఐదువేల హెక్టార్లకు పైగా పత్తి పంట వేశారు. గతఏడాదితో పోలిస్తే ఇది చాలా తక్కువ. ప్రతి ఏటా జూన్ ఆఖరులో, జూలై మొదటి వారంలో పంట వేస్తే సెప్టెంబరు ఆఖరుకు, అక్టోబరు మొదటి వారంలో మొదటి కోత రైతులకు అందేది. ఆ పంటను అమ్ముకుని పెట్టుబడులకు చేసిన అప్పులను కొంతవరకు తీర్చేవారు. ఈ ఏడాది ఇంతవరకు మొదటి కాపు రాలేదు. మొక్కలు బాగా పెరిగి, పూతకు వచ్చే టైములో కురిసిన వర్షాలకు పంట మొత్తం వర్షార్పణం అయింది. పడిన పూత, కాయ రాలిపోయింది. తెగుళ్లు, వర్షపునీళ్లు రోజులతరబడి పంట భూమిలో నిలబడటం వల్ల పంట ఉరకేసిపోయింది.



తెగుళ్లతో రాలిపోతున్న పిందె,కాపు

మూడు క్వింటాళ్లు కష్టమే..



నేను నాలుగు ఎకరాలలో పత్తి పంట వేస్తే, సెప్టెంబరులో కురిసిన వర్షాలకు ముందు వరకు పంట బాగానే ఉంది. వర్షాలకు పంట మొత్తం తీవ్రంగా దెబ్బతింది. నాకు పరిహారం కూడా రాయలేదు. ప్రస్తుతం పంట పరిస్థితి చూస్తే మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేటట్లు లేదు. నేను ఇప్పటి వరకు ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టా.

– అనుముల సాంబిరెడ్డి, రైతు, రుద్రవరం

తుడిచిపెట్టుకుపోయింది..



నేను మూడు ఎకరాలలో పత్తి పంటవేశా. వర్షాలకు తుడిచిపెట్టుకుపోయింది. పెట్టుబడులు కూడా రావడం కష్టంగా ఉంది. మహా వస్తే 5క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఎకరాకు రూ.30వేలు పెట్టా.

– బోదెల హనిమిరెడ్డి, రైతు, కోగంటివారి పాలెం

అందని పరిహారం

మాదిపాడు, గింజుపల్లి, తాడువాయి, కుంటిమద్ది, గిరిజనతండాలైన కంచుబోడుతండా, జడపల్లి తండాలలో పత్తిపంట మొత్తం వర్షాలకు మునిగిపోయింది. మునిగిన పంటలకు పెట్టుబడులు పెట్టడం అనవసరంగా భావించిన చాలా మంది రైతులు పంట భూములను దున్నేసి మిర్చి పంటలు వేస్తున్నామని చెబుతున్నారు. తమకు పంట పరిహారం కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

వరిలో తెల్ల తెగులు సత్వరమే నివారించాలి

నకరికల్లు: వరిలో ఆకుముడత, తెల్లతెగులు అధికంగా కనిపిస్తోందని, నివారణకు సత్వర చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఆకుల్లో గొంగళి పురుగు ప్రవేశించి పత్రహరితాన్ని గోకి తినడం వల్ల ఆకు తెల్లగా మారుతుందని అన్నారు. వరి దుబ్బులో ఒక లార్వా లేక రెండు పురుగులు సోకినట్లయితే సత్వరమే నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. వరి పిలకదశలో ఉన్నప్పుడు చేనుకు అడ్డంగా తాడులో రెండు మూడుసార్లు లాగితే పురుగులు కింద పడి పోతాయన్నారు. క్లోరోపైరిఫాస్ 500 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 300 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో జి.విష్ణువర్ధన్, సర్పంచి ఎస్.మరియమ్మ మత్తయ్య, ఉపసర్పంచి ఎస్.అంకారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ నవాజ్‌షరీఫ్, వీహెచ్ఏ పి.సాయివెంకట్ పాల్గొన్నారు.

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని వరి సాగులోని యాజమాన్య పద్ధతులను వివరించారు. అధిక వర్షాలనుంచి పంటలను కాపాడుకునే విధానాలపై అవగాహన కల్పించారు. గులాబీరంగు పురుగు నివారణ చర్యలను, వ్యవసాయశాఖ ద్వారా అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పి.శైలజ, వీఆర్వో మాబువలి, సుమతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి



నందిరాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందజేస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహార పదార్థాలుగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని నందిరాజుపాలెంలో బుధవారం రైతు సాధికార సంస్థ ద్వారా ఆరోగ్యం, పోషకాహారం విభాగం వారితో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, నిత్య అవసర ఆహార పదార్థాలను పంపిణీ 'ఫుడ్ బాస్కెట్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ రైతులు పంపించిన ఉత్పత్తులను వారి వద్ద సేకరించి ఉత్పత్తులు అవసరమైన వారికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. సంఘాల సభ్యుల ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకు ఆహార ఉత్పత్తులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రసాయన రహిత ఆహార పదార్థాలు పూర్తి స్థాయిలో తీసుకోవడం వలన అనారోగ్యం పైన ఖర్చు తగ్గి ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని వివరించారు. రాబోవు రోజుల్లో ప్రతి గ్రామంలో అన్ని రకాల ఆహార పదార్థాలు ప్రకతి వ్యవసాయ పద్ధతులలో స్థానికంగా పండించి తినే దిశగా సాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రీషన్ స్టేట్ రిసోర్స్ పర్సన్ బి.శైలజ, మౌనిక, ఎంటీఎల్ పవన్, హెల్త్ అండ్ న్యూట్రిషన్ కార్యకర్త ధర్మతేజ, ఎంటీలు వీరమ్మ, అనంతలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: గ్రామాలను అభివృద్ధి పథంలో నడపించడమే ధ్యేయంగా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, పనిచేయకుండా ఉన్న బోర్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్న గ్రామాలలో పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేసుకునేలా అవగహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిత్యం సిబ్బందితో చేయించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా తాగునీటి ట్యాంక్‌లలో బ్లీచింగ్ వేయించాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, తహసీల్దార్ అఫ్రవున్నీసా బేగం, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, చిట్టెంశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో అభ్యంతరాలు తెలియజేయాలి



బెల్లంకొండలో జాబితా ప్రదర్శిస్తున్న ఏఓ కృష్ణయ్య

బెల్లంకొండ: ఈ-క్రాప్ నమోదులో ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని సరి చేసుకునేందుకు రైతులు అభ్యంతరాలను తెలియజేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.కృష్ణయ్య కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో రైతు సేవ కేంద్రాలలో ఈక్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. అభ్యంతరాల స్వీకరణకు వ్యవసాయ సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులు అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేస్తే ఈనెల 18వ తేదీ లోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. 18న తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ క్రాప్ నమోదు తుది జాబితా ఆధారంగానే పంట నష్టపరిహారం, పంటల, ఉన్నాప్ వడ్డీ పంట రుణాలు వంటి వాటికీ అర్హత పొందుతారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం కావాలి



విద్యార్థులకు ఆహార మొక్కల గురించి వివరిస్తున్న పర్యావరణ వేత్త జాజి

కారెంపూడి: ప్రకృతి ఆహార దినోత్సవం సందర్భంగా బుధవారం కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త, సాక్షి ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత కొమెర అంకారావు (జాజి) మండలంలోని వివిధ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రకృతిలో సహజ సిద్ధంగా దొరికే ఆహారపు మొక్కల గురించి అవగాహన కల్పించారు. మండలంలోని మిరియాల జెడ్పీ హైస్కూల్, గుత్తికొండ జెడ్పీ హైస్కూల్‌ల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పకృతి సిద్ధంగా దొరికే కలుషితం కాని ఆహారం గురించి వివరించారు. పాఠశాలల పరిసరాలలోనే ఉన్న మొక్కల ప్రాధాన్యతను వివరించి మన పూర్వీకులు వీటిని తమ ఆహారంలో భాగంగా చేసుకున్న తీరును వివరించారు. ప్రకృతితో మమేకమై జీవిస్తే ఆరోగ్యం సొంతం అవుతుందని, సూర్యోదయం కంటే ముందే లేచి సూర్య నమస్కారంతో దినచర్య ప్రారంభించి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో లోని అంశాలన్నీ నెరవేరుస్తాం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

ముప్పాళ్ల: మేనిఫెస్టోలోని అంశాలన్నీ నెరవేర్చి తీరుతామని, పేదలకు, రైతులకు, మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల, మాదల గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ముప్పాళ్లలో రూ.10 లక్షలు, మాదలలో రూ.3 7లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ కళ్ల వీరభాస్కరరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఎంపీడీఓ విలియమ్స్, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బయట పడ్డ విభేదాలు....

పల్లె పండుగ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఎదుటే టీడీపీలోని రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఒక వర్గం వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి అడ్డుగా మరో వర్గం నేత పెట్టాడని, ఒకరి పై ఒకరు దూషణలకు దిగారు. టీడీపీలోని పెద్ద నాయకులు సర్దిచెప్పటంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం గ్రామంలోని నాము పరమేష్ ఇంట్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ టిఫిన్ చేస్తుండగా ఇరు వర్గాల వారు గతంలో నెలకొన్న కేసుల ప్రస్తావనను ఎమ్మెల్యేకు వివరిస్తూ ఒకరిపై ఫిర్యాదు లు చేసుకుంటూ దూషణలకు దిగారు. పరిస్థితి చేయి దాటటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాల వారిని బయటకు తోసివేశారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేయాలంటూ ఒక వర్గం వారు పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాత్రం ఇరువర్గాల వారిని పిలిపించి కేసులు లేకుండా చేయాలంటూ పోలీసులకు సూచించారు. గ్రామంలోని మైనార్టీకి చెందిన ఒక వర్గం టీడీపీ నేతలు ఎమ్మెల్యే నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి హాజరు కాలేదు.

88త్యాళ్లూరు, ఆవులవారిపాలెంలో..

క్రోసూరు: మండలంలోని 88త్యాళ్లూరు, ఆవులవారిపాలెం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యులు సీహెచ్ మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెంలో పల్లెపండుగ వారోత్సవాలలో భాగంగా తెలుగు దేశం పార్టీ నాయకులు బుధవారం సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో కచేరి పక్కన ఉన్న రోడ్డుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మించేందుకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

గ్రామాలలో అభివృద్ధే 'పల్లె పండుగ' ధ్యేయం

బెల్లంకొండ: గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే 'పల్లె పండుగ' కార్యక్రమం ధ్యేయమని ఎంపీడీఓ వై.హనుమారెడ్డి తెలిపారు. మండలంలోని గంగరెడ్డిపాలెం నాగిరెడ్డిపాలెం గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ కోటమ్మ, సర్పంచు ఆసుల జగన్, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య పాల్గొన్నారు.

నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

దుర్గి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్టీయూ దుర్గిశాఖ అధ్యక్షుడు షేక్ నబీ సాహెబ్, కార్యదర్శి కటకం అపర్ణలు పేర్కొన్నారు. బుధవారం పలు పాఠశాల్లోని ఉపాధ్యాయులను కలిసి ఓటనమోదు చేసుకోవల్సిందిగా కోరారు. ఓటు హక్కు పొందేందుకు ఫారం 18ను పూర్తి చేసి సంబంధిత శాఖాధికారులకు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో పాస్‌పోర్టు ఫొటో, ఆధార్‌కార్డు, గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లతో నమోదు చేయవచ్చునన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రెంటచింతల: మండలంలోని పాలువాయి జంక్షన్ – పాలువాయి గేటు గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పాలువాయి గేటు గ్రామానికి చెందిన జెవిశెట్టి శ్రీనివాసరావు(35) పాలువాయి జంక్షన్ నుంచి ద్విచక్రవాహనంపై తన గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో అదుపు తప్పి మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటేశ్వరమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటన స్థలానికి ఎస్ఐ సీహెచ్ నాగార్జున చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న గోపాలరావు

రొంపిచర్ల: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సీపీఎం మండల శాఖ ద్వితీయ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు సీపీఎం మండల సీనియర్ నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు అధ్యక్షత వహించారు. ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక కొరత వలన కొన్ని లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారన్నారు. వరద బాధితులకు ఇప్పటికీ సరైన నష్టపరిహారం అందలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటైజేషన్ చేయకుండా ఆపాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు ఉన్న వారికి రైతు భరోసా కల్పించి, బ్యాంకు రుణాలు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రొఫెసర్ సాయిబాబాకు, అదే విధంగా పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సీపీఎం మాజీ శాసన సభ్యురాలు మల్లు స్వరాజ్యంలు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం రొంపిచర్ల, సంతగుడిపాడు, పరగటిచర్ల గ్రామాల శాఖలకు నూతన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సీపీఎం రొంపిచర్ల గ్రామ శాఖ కార్యదర్శిగా అంగులూరి ఫణీంద్ర, సంతగుడిపాడు గ్రామ శాఖ కార్యదర్శిగా బండారుపల్లి నాగేశ్వరరావు, పరగటిచర్ల గ్రామ శాఖ కార్యదర్శిగా పోట్లూరి అంజిరెడ్డి లు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.శివకుమారి, కామినేని రామారావు, బాలకోటయ్య, ఖాశింసైదులు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన కారెంపూడి తండావాసి

కారెంపూడి: వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మండలంలోని కారెంపూడి తండాకు చెందిన రమావతు బాలోజీ నాయక్‌ను న్యూఢిల్లీలోని ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ (ఐప్యాక్) గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ బుధవారం ఆయనకు సమాచారం అందించింది. నవంబరులో న్యూఢిల్లీలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బాలోజీ నాయక్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. జాన్సీ లక్ష్మీభాయ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫౌండేషన్ ద్వారా బాలోజీ నాయక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను గుర్తించి ఐప్యాక్ సంస్థ ఆయనకు ఈ గౌరవాన్ని ప్రకటించింది. బాలోజీ నాయక్ కొండమంజులూరు జెడ్పీ హైస్కూల్లో ఒకేషనల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఫౌండేషన్ ద్వారా గత మూడేళ్లకు పైగా సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నానని బాలోజీ నాయక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చర్లగుడిపాడులో 'పొలం పిలుస్తోంది'

గురజాల రూరల్ (చర్లగుడిపాడు): మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు రైతులు తీసుకుని మంచి దిగుబడి సాధించాలన్నారు. ప్రభుత్వం విత్తనాల సరఫరాతో పాటు రైతుసేవ కేంద్రాల్లో ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. పంట నమోదు ప్రక్రియ చేసుకోవడం వలన, పంటల బీమా వలన రైతులకు కలిగే లాభాలను వివరించారు. అనంతరం గ్రామంలోని పలు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

మాచవరం: ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమని ఏఓ కె.రామమ్మ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు.